అదనపు కలెక్టర్ వర్సెస్ ఎమ్మెల్యే సంజయ్

- జగిత్యాలలో ఇద్దరి సంవాదం
- రాజకీయాల్లో మూర్ఖపు ఆలోచనలు తగదన్న ఏసీ
- అధికారుల అవినీతి తెలిసిందే అని ఎమ్మెల్యే అసహనం

సమావేశంలో వేదికపై మాట్లాడుకుంటున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్, అదనపు కలెక్టర్ లత

జగిత్యాల, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : రాజకీయాల్లో మూర్ఖపు ఆలోచనలకు, స్వార్థ నిర్ణయాలకు తావు లేదంటూ జగిత్యాల అదనపు కలెక్టర్ వ్యాఖ్యానిస్తే.. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల అవినీతి సంగతి అందరికీ తెలుస్తూనే ఉందంటూ జగిత్యాల ఎమ్మెల్యేసంజయ్‌కుమార్ వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యంలో స్వార్థ రాజకీయాల గురించి అదనపు కలెక్టర్ స్పందించడం, అధికారుల అవినీతిపైన ఎమ్మెల్యే మాట్లాడటం పెద్ద చర్చకు దారితీసింది. జగిత్యాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం వికసిత్ భారత్ ఆధ్వర్యంలో 'యంగ్ పార్లమెంట్' నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ లత విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాజకీయాలు స్వార్థపూరితంగా మారిపోయాయని, ప్రజాస్వామ్యం సరిగా అమలు కావడం లేదని అన్నారు. ఢిల్లీ లాంటి చోట్ల జరుగుతున్న రాజకీయాలు కలుషితమయ్యాయని, ఇలాంటి అంశాలు రాష్ట్రంలోనూ కనిపిస్తున్నాయని తెలిపారు. రాజకీయాల్లో మూర్ఖపు ఆలోచనలు, స్వార్థ నిర్ణయాలకు తావు లేదని పేర్కొన్నారు. ఇదే సమయంలో వేదికపై ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అదనపు కలెక్టర్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. అక్కడే ఉన్న మీడియా మిత్రులు కవరేజ్‌ని నిలిపివేయాలని కోరారు. అదనపు కలెక్టర్ రాజకీయాల గురించి మాట్లాడటం సరికాదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అవినీతికి పాల్పడుతున్న విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అధికారుల అవినీతిపై తాము సైతం మాట్లాడవచ్చునంటూ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలతో కంగుతిన్న అదనపు కలెక్టర్ లత.. తన మాటల ఉద్దేశం అదికాదంటూ వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తదుపరి ఆమె మాట్లాడుతూ, తన మాటల్లో తప్పులు ఉంటే వెనక్కి తీసుకుంటున్నాని చెప్పారు. వేదికపైనే నెలకొన్న సంవాదంతో విద్యార్థులు, ఉపన్యాసకులు అందరూ ఆశ్చర్యపోయారు. ఈ క్రమంలోనే తన ప్రసంగాన్ని ముగించిన అదనపు కలెక్టర్ సమావేశం ఉందంటూ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రసంగం కాకముందే వెళ్లిపోయారు.

క్షేమంగా ఇంటికి దళిత రైతు వెంకటయ్య

- సోషల్ మీడియాకు తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు
- అర్ధరాత్రి ఇంటిదగ్గర వదిలివెళ్లిన పోలీసులు
- తన భూమి తిరిగి ఇవ్వాలని వేడుకున్న రైతు వెంకటయ్య
- వెంకటయ్యను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

దళిత రైతు దర్శనం వెంకటయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఇనుగుర్తి, మార్చి 20 : సీఎం రేవంత్‌రెడ్డిని తిట్టాడనే కారణంతో దౌర్జన్యంగా అరెస్ట్ చేసిన దళిత రైతు దర్శనం వెంకటయ్యను సీసీఎస్ పోలీసులు ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి క్షేమంగా వదిలిపెట్టారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారానికి చెందిన దళిత రైతు వెంకటయ్య (77)ను బుధవారం సీసీఎస్ పోలీసులు ఎలాంటి సమాచారం లేకుండా అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించారు. రేవంత్‌రెడ్డిని ప్రశ్నించాడనే కారణంతో దళిత రైతును అరెస్టు చేశారనే విషయం రాష్ట్రవ్యాప్తంగా వైరల్ అయ్యింది. 'నా భర్త వెంకటయ్య ఇంటికాడ అన్నం తింటుండగా.. పోలీసులు వచ్చి అన్నం పళ్లెం గుంజేసి.. అటో రెక్క ఇటోరెక్క పట్టుకొని తీస్కానిపోయిండ్రు.. నా ముసలోడు బువ్వదినకుండా ఎత్కపోయిండ్రు' అని లక్ష్మి వాపోయిన విషయం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో వెంకటయ్యను గురువారం తెల్లవారుజామున 1.30 గంటలకు సీసీఎస్ పోలీసులు ఇంటి వద్ద వదిలిపెట్టారు. ఈ సందర్భంగా గురువారం వెంకటయ్య 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం తన భూసమస్యను చెప్పడానికి హైదరాబాద్‌కు వెళ్లినట్టు తెలిపారు. అక్కడ కొంతమంది యూట్యూబ్ చానళ్ల వారు తనను ఇంటర్వ్యూ చేయగా, భూ సమస్య గురించి చెప్పానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని కావాలని ఉద్దేశపూర్వకంగా దూషించలేదని, తన భూమి పోయిందన్న బాధలో మాట్లాడినట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ హయాంలో లాక్కున్న 5 ఎకరాలను తిరిగి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఇదే విషయాన్ని సీసీఎస్ పోలీసులకు చెప్పగా సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇంటికి తిరిగి వచ్చిన రైతు వెంకటయ్యను మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు.

వేసవికి ముందే అడవుల్లో కార్చిచ్చులు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): వేసవికి ముందే అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రతిరోజూ సగటున 164కు పైగా ప్రమాదాలు జరగటంతో అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం.. ఈ ఏడాది జనవరి 1నుంచి మార్చి 10 వరకు కేవలం రెండు నెలల్లోనే 11,434 అగ్ని ప్రమాదాలు సంభవించాయి. నిరుడు 14,027 ప్రమాదాలు జరుగగా, ఈఏడాది ఆదిలోనే ప్రమాదాలు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. భద్రాద్రి సర్కిల్‌లో అత్యధికంగా 3,243 అగ్ని ప్రమాదాలు నమోదు కాగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ 2,479, కాళేశ్వరం 2,080, బాసర 1,784, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ 924, రాజన్న-సిరిసిల్ల 788, చార్మినార్ సర్కిల్‌లో 146 ప్రమాదాలు నమోదయ్యాయి. మానవ తప్పిదాలే ఈ దుష్టితికి ప్రధాన కారణమని అధికారులు చెప్పారు.

జనగణనలో కులగణన చేయాలి

- అప్పుడే ఎవరి వాటా ఎంతో తేలుద్ది
- బెంగళూరులో ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కుల గణన నిర్వహించాలని ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే ఎవరి వాటా ఎంతో తేలుద్దని స్పష్టంచేశారు. దేశ భవిష్యత్తు, బడుగు బలహీనవర్గాల భవిష్యత్తు మారాలంటే కేంద్రం కులగణన చేపట్టాల్సిందేనని పునరుద్ఘాటించారు. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్ హోటల్‌లో నిర్వహించిన ఓబీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో చాలా రాష్ట్రాల బీసీల రిజర్వేషన్ల బిల్లులు కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. బీసీల బిల్లులకు ఆమోదం తెలిపే బాధ్యత బీజేపీ ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. సమావేశంలో తమిళనాడు తరహా రిజర్వేషన్లు కేటాయించాలని, దీనికి అన్ని పార్టీలు సహకరించాలని చర్చించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఓబీసీ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నమ్మించి గొంతు కోసింది!

జీవో-46 బాధితుల ఆగ్రహం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం తమను నమ్మించి గొంతు కోసిందని జీవో-46 బాధితులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు తమను రెచ్చగొట్టి ఓట్లు వేయించుకొని, గెలిచాక నట్టేట ముంచిందని మండిపడ్డారు. ఈ మేరకు బాధితులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టులో వాదనలకు తీవ్ర అడ్డంకులు సృష్టించి ఆర్థికంగా, మానసికంగా తమను ఇబ్బంది పెట్టిందని ఆరోపించారు. కేసును ముందుకు సాగకుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. చందాలు వేసుకొని సుప్రీంకోర్టుకు వెళ్తే అక్కడ కూడా న్యాయం జరగకుండా అడ్డుపడుతూ గ్రామీణ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపి, ఈ నెల 25న ఫైనల్ హియరింగ్‌కు సహకరించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఇప్పటికే 1,055 కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా మిగిలిపోయాయని, తమకు న్యాయం చేయకపోతే స్థానిక ఎన్నికల్లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో బాధితులు ఆకాశ్, శంకర్, కల్యాణ్, నవీన్, సూరి, రాజ్‌కుమార్, చెర్రీ, ప్రవీణ్ ఉన్నారు.

టార్గెట్ టాలీవుడ్!

వరుస కేసులతో టాలీవుడ్ సతమతం

ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా టార్గెట్ చేస్తుందని అనుమానం

సినీరంగం భవిష్యత్తుపై భయాందోళనలు

పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి రేవంత్ సర్కార్ ఎంచుకున్న మార్గం 'డైవర్షన్ పాలిటిక్స్'. అందుకు సినీరంగాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఇండస్ట్రీ వర్గాలను కలవరపరుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఓ ప్రణాళిక ప్రకారం రేవంత్ సర్కార్ సినీరంగంపై వేధింపులకు పాల్పడుతున్నదని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఎప్పుడో ముగిసిపోయిన డ్రగ్స్ కేసును తిరగదోడతామని చేసిన బెదిరింపులు మొదలు నిన్నటి బెట్టింగ్ యాప్స్ వ్యవహారం వరకూ ప్రభుత్వం హిడెన్ అజెండాతో సినీ రంగాన్ని టార్గెట్ చేస్తున్నదని సినీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఓవైపు డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇండస్ట్రీని వాడుకుంటూనే మరోవైపు సినీ రంగంలోని తమ వ్యతిరేకులను దారికి తెచ్చుకునే వ్యూహంలో భాగమిదని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లో తెలుగు సినీరంగం స్థిరపడిన నాటి నుంచి ఏనాడు పరిశ్రమ ఈ స్థాయిలో రాజకీయపరమైన వేధింపులను ఎదుర్కోలేదని పలువురు సినీ పెద్దలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ దేశంలో రెండో అతిపెద్ద సినీ ఇండస్ట్రీ అయిన టాలీవుడ్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ఉన్నాయనే మాటలు వినిపిస్తున్నాయి.

పేరు మర్చిపోవడమే శాపమైందా?

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ అరెస్ట్ జాతీయ స్థాయిలో హాట్‌టాపిక్‌గా మారింది. వాస్తవానికి 'పుష్ప-2' విడుదలకు ముందు బెనిఫిట్‌షోలకు, టికెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం అన్ని రకాల అనుమతులిచ్చింది. అయితే సినిమా విడుదల అనంతరం ఓ ప్రెస్‌మీట్‌లో అల్లు అర్జున్.. సీఎం రేవంత్ పేరు మర్చిపోవడం ఈ వివాదాన్ని మలుపుతిప్పిందంటారు. తన పేరునే మర్చిపోయాడనే కక్షతో సీఎం రేవంత్ ఆదేశాల మేరకు అల్లు అర్జున్ అరెస్ట్ జరిగిందని ఇండస్ట్రీలో జోరుగా చర్చ నడిచింది. తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్‌కు ప్రత్యక్ష ప్రమేయం ఏమీ లేదని, ఇలాంటి సంఘటనల్లో సినీ హీరోను అరెస్ట్ చేసిన దాఖలాలు ఎక్కడా లేవని నాడు పలువురు సినీ ప్రముఖులు అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ సినీ ప్రముఖులతో ఓ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశం అనంతరం అల్లు అర్జున్ వివాదం మొత్తం సమసిపోయింది. ఈ మీటింగ్ పేరుతో రేవంత్ ఇండస్ట్రీతో 'సెటిల్‌మెంట్' చేసుకున్నారని ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరిగింది.

బెనిఫిట్ షోలపై వేటు

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం సినీరంగంపై ఆంక్షలు విధించడం మొదలుపెట్టిందని చెబుతారు. పెద్ద హీరోల చిత్రాల విషయంలో బెనిఫిట్‌షోలకు అనుమతినిచ్చే ఆనవాయితీ ఎప్పటి నుంచో ఉంది. ఈ విషయంలో అన్ని ప్రభుత్వాలు సినీరంగం పట్ల సానుకూలంగానే స్పందించాయి. అయితే సంధ్య థియేటర్ ఘటన అనంతరం బెనిఫిట్‌షోలను రద్దు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. టికెట్ రేట్ల పెంపు కూడా ఉండబోదని స్పష్టం చేసింది. 'గేమ్ ఛేంజర్' చిత్రానికి నామమాత్రంగా టికెట్ రేట్ల పెంపునకు అనుమతినిచ్చింది. బెనిఫిట్‌షోల విషయంలో ప్రభుత్వ మొండి వైఖరి అగ్ర నిర్మాతలకు ఇబ్బందికరంగా మారింది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టే కాంపెయిన్ విషయంలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశమయ్యాయి. సినీ నటులు తప్పకుండా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో పాల్గొనాలని, అందుకు సంబంధించిన వీడియోలు చేయాలని, లేని పక్షంలో వారి సినిమాలకు అనుమతులు ఇవ్వమని ఓ సభలో సీఎం రేవంత్ హెచ్చరించడం పరిశ్రమ వర్గాల్లో భయాల్ని రేకెత్తించింది.

మహిళా కమిషన్ ప్రకటనతో మరో వివాదం

ఇటీవల తెలుగు సినిమా పాటల్లో అసభ్యకరమైన డ్యాన్స్ స్టెప్పులు ఉంటున్నాయని, ఇండస్ట్రీ పద్ధతి మార్చుకోవాలని తెలంగాణ మహిళా కమిషన్ ఆదేశించడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్‌టాపిక్‌గా మారింది. అసభ్యకరమైన డ్యాన్సుల విషయంలో తమకు ఫిర్యాదులు అందాయని కమిషన్ పేర్కొంది. 'సినిమా కంటెంట్ నియంత్రణ విషయాన్ని సెన్సార్ బోర్డ్ చూసుకుంటుంది. ఏమైనా అభ్యంతరకరమైన మాటలు, సన్నివేశాలు, డ్యాన్సులు ఉంటే తొలగించే అధికారం సెన్సార్ బోర్డ్‌కు ఉంటుంది. ఎప్పుడూ లేనిది సినిమాల విషయంలో మహిళా కమిషన్ వార్నింగ్ ఇవ్వడం అర్థం కావడం లేదు. ఇలా జరగడం ఇదే తొలిసారి' అంటూ ఇండస్ట్రీలో చర్చ జరుగుతున్నది. ఇలా వరుసగా జరుగుతున్న పరిణామాలు తెలుగు సినీరంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. 'ఇవన్నీ గమనిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రీని ఉద్దేశ్యపూర్వకంగా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇప్పటివరకు ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సినీ రంగాన్ని టార్గెట్ చేయలేదు' అని సినీ వర్గాలు అంటున్నాయి. ఇక ముందు కేసుల రూపంలో ఎలాంటి వేధింపులను ఎదుర్కోవాల్సివస్తుందోనని పలువురు దర్శకనిర్మాతలు, నటీనటులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు.

చిత్రం

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరోసారి ఇండస్ట్రీ టార్గెట్

తాజాగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాష్‌రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్ వంటి సినీ ప్రముఖులతో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. బెట్టింగ్ యాప్స్ ట్రాప్‌లో పడి ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అప్పుల ఊబిలో చిక్కి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ యాప్స్‌కు వ్యతిరేకంగా అందరూ గళం విప్పాల్సిందే. అందులో ఎటువంటి సందేహం లేదు. అయితే బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారంలో కేసులు ఎదుర్కొంటున్న రానా, విజయ్ దేవరకొండ వంటి హీరోలు తాము స్కిల్ బేస్డ్ గేమ్స్‌కు మాత్రమే ప్రచారం చేశామని, వాటికి చట్టబద్ధత ఉందని తమ పీఆర్ టీమ్స్ ద్వారా స్పందన తెలియజేశారు. వాటి తాలూకు కాంట్రాక్ట్ కూడా కొన్నేళ్ల క్రితమే ముగిసిందని వివరణ ఇచ్చారు. ఈ విషయాలన్నింటికి పరిగణనలోకి తీసుకోకుండా ఒక్కసారిగా పోలీసులు కేసు నమోదు చేయడమేంటని ఇండస్ట్రీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇది కచ్చితంగా రేవంత్ సర్కార్ ఆడుతున్న మరో డైవర్షన్ గేమ్ అని సోషల్‌మీడియాలో నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

విజయ్ దేవరకొండ స్కిల్ బేస్డ్ గేమ్స్‌కు మాత్రమే ప్రచారం నిర్వహించారు. ఆ కంపెనీలను చట్టప్రకారమే నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ స్కిల్ బేస్డ్ గేమ్స్ అనుమతి ఉన్న ప్రాంతాలకు మాత్రమే విజయ్ ప్రచారకర్తగా వ్యవహరించారు. ఆయన ఏ ప్రకటన చేసినా, కంపెనీకి ప్రచారకర్తగా ఉన్న సదరు సంస్థ న్యాయపరంగా వ్యవహరిస్తున్నదా? లేదా? అనే విషయాన్ని విజయ్ టీమ్ పరిశీలిస్తుంది. కంపెనీ లేదా ఉత్పత్తి చట్టప్రకారం ఉందని తెలిసిన తర్వాతే విజయ్ ప్రచారకర్తగా వ్యవహరిస్తారు. అలాంటి అన్ని అనుమతులు ఉన్న ఏ23 అనే సంస్థకు, బ్రాండ్‌కు విజయ్ అంబాసిడర్‌గా పనిచేశారు. రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని గతంలో గౌరవనీయ సుప్రీంకోర్టు కూడా తెలియజేసింది. ఏ23 అనే కంపెనీతో విజయ్ ఒప్పందం గత ఏడాది ముగిసింది. ఇప్పుడు ఆ సంస్థతో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. విజయ్‌దేవరకొండ విషయంలో పలు మాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న ఏ సంస్థకూ ఆయన ప్రచారకర్తగా వ్యవహరించలేదు

- టీమ్ విజయ్ దేవరకొండ

స్కిల్‌బేస్డ్ ఆధారిత గేమ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడానికి రానా దగ్గుబాటి ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దాని గడువు 2017లో ముగిసింది. చట్టబద్ధంగా ఆమోదం ఉన్న ఆన్‌లైన్ నైపుణ్య ఆధారిత గేమ్‌లకే రానా ప్రచారకర్తగా వ్యవహరించారు. ఒప్పందాలు చేసుకునే ముందు రానా దగ్గుబాటి న్యాయబృందం అన్నింటికి క్షుణ్ణంగా సమీక్షిస్తుంది. చట్టానికి పూర్తి అనుగుణంగా ఉన్న ప్లాట్‌ఫామ్‌నే రానా అంగీకరించారు.

-రానా పీఆర్ టీమ్

ఈయాడ్ 2016లో నా దగ్గరకు వచ్చింది. అది చేయడం తప్పని కొద్ది నెలల్లోనే తెలుసుకున్నా. 2017లో నా అగ్రిమెంట్‌ను పొడిగిస్తానని వాళ్లు అడిగితే 'యాడ్ తెలియక చేశాను. ఏడాది అగ్రిమెంట్ అయిపోయింది కాబట్టి వెంటనే దాన్ని ఆపమని మీకు చెప్పలేకపోయా. ఇక ఆ యాడ్‌ను ప్రసారం చేయొద్దు. నేను నటించను' అని చెప్పాను. దీని తర్వాత ఏ గేమింగ్ యాప్‌లకు ప్రచారకర్తగా పనిచేయలేదు. 2021లో ఆ కంపెనీ మరో కంపెనీకి అమ్మేస్తే సోషల్‌మీడియా వేదికలో నా ప్రకటనవాడారు. వాళ్లకు లీగల్ నోటీసులు పంపాను. వెంటనే వాళ్లు ఆపేశారు. ఇప్పుడు మళ్లీ అది లీకైంది. అందువల్లే ఈ సమాధానం చెబుతున్నా'

- ప్రకాష్‌రాజ్

ప్రముఖ సినీనటులపై కేసు నమోదు

మియాపూర్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): సోషల్‌మీడియాలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న పలువురు యాంకర్లపై ఇటీవలే పంజాగుట్ట పోలీసులు కేసునమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయమై మియాపూర్ ప్రగతినగర్‌కు చెందిన ప్రదీప్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రముఖ సినీనటులు దగ్గుపాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాశ్‌రాజ్, నిధి అగర్వాల్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు వీరిపై పలు సెక్షన్ల కింద కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సినిమాల్లో అసభ్య నృత్యాలపై కఠిన చర్యలు

సినీవర్గాలకు మహిళా కమిషన్ హెచ్చరిక

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): కొన్ని సినిమా పాటల్లో ఉపయోగిస్తున్న డాన్స్‌స్టెప్స్ అసభ్యంగా, మహిళలను కించపరిచేలా ఉన్నాయంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర మహిళా కమిషన్ స్పందించింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 'సినిమా అనేది సమాజంపై ప్రభావం చూపే శక్తిమంతమైన మాధ్యమం అని, అందులో మహిళలను అవమానించేలా, అసభ్యకరంగా చూపించడం ఆందోళనకరమని పేర్కొంది. సినిమా దర్శకులు, నిర్మాతలు, కొరియోగ్రాఫర్లు, సంబంధిత వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషన్ హెచ్చరించింది. మహిళలను కించపరిచేలా చూపించే డాన్స్‌స్టెప్స్‌ను వెంటనే తొలగించాలని, హెచ్చరికను పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది. ప్రజలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలను కమిషన్ దృష్టికి తీసుకువస్తే, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిమిషానికి 90వేలు..!

ఖైరతాబాద్, మార్చి20(నమస్తే తెలంగాణ): ఒక నిమిషం వీడియోకు రూ.90వేలు చార్జ్ చేశామని, ఇలా సుమారు15 వీడియోలు ప్రమోట్ చేసినట్లు పంజాగుట్ట పోలీసుల విచారణలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లు చెప్పినట్లు తెలిసింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన విష్ణుప్రియ, రీతూచౌదరిలు గురువారం పంజాగుట్ట పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ ఇద్దరిని రాత్రి తొమ్మిదిగంటల వరకు పోలీసులు విచారించారు. విష్ణుప్రియను సుమారు పదిగంటలపాటు, రీతూ చౌదరిని ఆరుగంటలపాటు పంజాగుట్ట డీఐ శ్రవణ్ ఆధ్వర్యంలో విచారించారు. ఇద్దరి బ్యాంకు లావాదేవీలను పరిశీలించిన పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ ద్వారా వచ్చిన నిధులపై ఆరా తీశారు. ఈ క్రమంలో వారెన్నెన్ని వీడియోలు చేశారు, ఒక్కో వీడియోకు ఎన్ని డబ్బులు తీసుకున్నారు.. అని అడిగారు. ప్రమోషన్ చేయడానికి వారిని ప్రోత్సహించిందెవరంటూ పోలీసులు ప్రశ్నించారు. గురువారం విచారణ పూర్తి అయిన తర్వాత ఈ ఇద్దరిని ఈనెల 25న మళ్లీ విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు చెప్పారు. ఇప్పటివరకు టేస్టీ తేజా, కానిస్టేబుల్ కిరణ్‌లను పోలీసులు విచారించారు.

అందుకే ఆ టైటిల్ పెట్టాం

'ప్రతి మనిషికి జీవితంలో ఓ లక్ష్యం ఉంటుంది. ఓ పనిని మనం ఎలా చేస్తున్నామన్నది చాలా ఇంపార్టెంట్. కొందరు డిఫరెంట్‌గా వాళ్ల టాస్క్‌ని కంప్లీట్ చేయాలని చూస్తారు. అలాంటి వారికి మనం క్రాక్ అంటుంటాం. అందుకనే ఈ సినిమా ఆ టైటిల్ పెట్టాం' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'జాక్-కొంచెం క్రాక్'. వైష్ణవి చైతన్య కథానాయిక. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ఈ సినిమా నుంచి ఓ రొమాంటిక్ గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ...హీరో క్యారెక్టరైజేషన్ నచ్చి ఈ సినిమాలో నటించడానికి ఒప్పుకున్నానని, ప్రేక్షకులను నవ్విస్తూనే బాధ్యతాయుతమైన పాత్రలో కనిపిస్తానని చెప్పారు. అన్ని వయసుల వారికి కనెక్ట్ అయ్యే కథాంశమిదని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

అమ్మాయిలు జాగ్రత్త పడతారు!

సత్య యాదు, ఆరాధ్య దేవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'శారీ'. ఆర్జీవి, ఆర్వీ ప్రొడక్షన్స్ పతాకంపై రవిశంకర్ నిర్మించారు. సైకలాజికల్ థ్రిల్లర్‌గా దర్శకుడు గిరికృష్ణ తెరకెక్కించారు. ఏప్రిల్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది. గురువారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఈ చిత్రానికి కథనందించిన ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ 'మన వ్యక్తిగత విషయాలను అందరితో షేర్ చేసుకోవడం వల్ల జీవితంలో చాలా ఇబ్బందులొస్తాయనే అంశంతో ఈ చిత్రాన్ని నిర్మించాం. ఈ సినిమా చూశాక అమ్మాయిలు జాగ్రత్త పడతారు' అన్నారు. తనకిది డ్రీమ్ ప్రాజెక్ట్ అని కథానాయిక ఆరాధ్యదేవి ఆనందం వ్యక్తం చేసింది.

ప్రేమ వెల్లువలో...

సక్సెస్‌ఫుల్ హిట్ ఫ్రాంచైజీలో భాగంగా వస్తున్న మూడో చిత్రం 'హిట్-ది థర్డ్ కేస్'. నాని కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వంలో ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. మే 1న విడుదలకానుంది. ఈ సినిమాలో 'ప్రేమ వెల్లువ..' అనే తొలి గీతాన్ని ఈ నెల 24న రిలీజ్ చేయబోతున్నారు. మెలోడీ ప్రధానంగా సాగే యుగళగీతమిదని, మిక్కీ జే మేయర్ కంపోజ్ చేసిన ట్యూన్ అందరిని అలరిస్తుందని, ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా ఈ